క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సత్తుపల్లిరూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి ఫైర్‌స్టేషన్ ఎఫ్‌ఎం రాజేంద్ర సూచించారు. స్థానిక మిరాకిల్‌మైండ్స్ పాఠశాలలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. పిల్లలను అగ్ని ప్రమాదం నుంచి బయటకు తీసుకొచ్చే విధానం, నీటిలో నుంచి బయటపడే విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎల్ఎఫ్ వీరబాబు, ప్రిన్సిపాల్ రత్నాకర్, ఫైర్ సిబ్బంది వీరబాబు, వెంకటేశ్వరరావు, సతీష్, బాబురావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరు వెటర్నరీ డాక్టర్‌గా మమత



మమత

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు పశువైద్యశాల వెటర్నరీ డాక్టర్‌గా మమత నియమితులయ్యారు. ప్రస్తుతం కల్లూరులోని పశువైద్యశాలలో డాక్టర్‌గా పనిచేస్తున్న ఆమె చెన్నూరుకు బదిలీ అయ్యారు. కల్లూరు వెటర్నరీ డాక్టర్ పోస్టు భర్తీ అయ్యే వరకు చెన్నూరు వెటర్నరీ డాక్టర్ మమత ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు శుక్రవారం మమత బాధ్యతలు స్వీకరించారు.

సత్తుపల్లి సీడీపీఓగా కనకదుర్గ



కనకదుర్గను సన్మానిస్తున్న సూపర్‌వైజర్లు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి సీడీపీఓగా కనకదుర్గ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు సూపర్‌వైజర్లు రమాదేవి, భవాని, సుజాత, రాజ్యలక్ష్మి, మల్లీశ్వరి, గంగాజలం, కార్యలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

టైం స్కేల్ వర్కర్ల సమ్మె



మాట్లాడుతున్న నరసింహారావు

మధిర: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ మధిర వ్యవసాయ పరిశోధన స్థానం టైం స్కేల్ వర్కర్ సెంట్రల్ యూనియన్ వారు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం నరసింహారావు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా మధిర వ్యవసాయ పరిశోధన స్థానంలో టైం స్కేల్ వర్కర్లు పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో కూడా అధికారులు వీరిచే పనిచేయించుకున్నారని తెలిపారు. అలాంటిది ప్రస్తుత అధికారులు వీరిని తొలగించి కాంట్రాక్ట్ ఉద్యోగుల పేరుతో కొత్తవారిని నియమించారని, దీంతో నిరక్షరాస్యులైన టైం స్కేల్ వర్కర్లకు అన్యాయం జరుగుతుందన్నారు. నాయకులు మురళి, రామనరసయ్య, విల్సన్ పాల్గొన్నారు.

5న ప్రజావాణి

కొణిజర్ల/వేంసూరు: ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించే ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమం ప్రతీ సోమవారం తహసీల్‌లో నిర్వహించనునట్లు కొణిజర్ల, వేంసూరు తహసీల్దార్లు తఫ్జల్ హుస్సేన్, ఎంఏ రాజు తెలిపారు. సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, మండలంలోని అన్ని పంచాయతీల ప్రజలు తమ సమస్యలు విన్నవించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జెడ్పీ చైర్మన్ నివాళి..

ముదిగొండ: మండలంలోని మల్లారంలో నాదెండ్ల రామయ్య దశదినకర్మకు జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు శుక్రవారం హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముదిగొండ ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీపీ హరిప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శి లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి..

సత్తుపల్లిరూరల్: గంగారంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందిన ముద్దిన వేణు, బేతి సురేష్, షేక్ కరీముల్లా మృతదేహాలను రామాగోవిందాపురంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ మహేష్, హరికృష్ణారెడ్డి, వేణు, వెంకటేశ్వరరావు, రామారావు, శంకర్‌రావు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు అమృతమే

- జిల్లాలో వైరా, సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీలకు నిధులు
- తొలగనున్న తాగునీటి ఇబ్బందులు



అమృత్ పథకం శంకుస్థాపన పనులు జరుగుతున్న దృశ్యం

వైరా: మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా మున్సిపాలిటీల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా పైపు లైన్లతో పాటుగా అవసరమైన చోట నీటి ట్యాంకులు నిర్మాణం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించిన అధికారులు అవసరమైన చోట నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

వైరా మున్సిపాలిటీలో..

వైరా మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులకు గాను సగానికి పైగా వార్డుల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రూ. 26.87 కోట్ల మేర 'అమృత్' నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే ఇక్కడ పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా మున్సిపాలిటీలో 30 ఏళ్లకు సరిపడా అంచనాలతో మూడు ఓవర్ హెడ్ ట్యాంకులతో పాటుగా 20 కిలోమీటర్ల మేర పైపు లైన్లు నిర్మించనున్నారు. ఒక్కో ఓవర్‌హెడ్ ట్యాంకుని 9లక్షల నుంచి 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తారు. మున్సిపాలిటీ పరిధిలో పల్లిపాడు, పట్టణంలోని పాతపంచాయతీ భవన సమీపంలో, ఇండోర్ స్టేడియం సమీపంలో వీటి నిర్మాణం చేపడుతారు. ఇప్పటికే మున్సిపాలిటీలో 1, 2, 3, 4, 7, 8వ వార్డులతో పాటుగా శివారు గ్రామాలైన లాలాపురం, సిద్దిక్‌నగర్, దిద్దిపూడి గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందిగా ఉంది. వేసవి కాలంలో మిషన్ భగీరథ పైపులైన్ల నుంచి చాలీచాలని నీళ్ల సరఫరా అవుతున్నాయి. కేంద్రం నిధులతో పైపులైన్ల నిర్మాణం చేపడితే ఇబ్బందులు తొలగనున్నాయి.

సత్తుపల్లి, మధిరలో..

సత్తుపల్లి మున్సిపాలిటీలోని 23 వార్డుల్లో తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు రూ.30 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ మున్సిపాలిటీలో సుమారు 45 వేల జనాభా ఉండగా తాగునీటి సమస్య వేధిస్తోంది. త్వరలో ఇక్కడ కూడా పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే మధిర మున్సిపాలిటీలో 22 వార్డులు ఉండగా సుమారు 34 వేల జనాభా ఉన్నారు. ఈ మున్సిపాలిటీకి అమృత్ పథకం ద్వారా రూ.17కోట్లు మంజూరు కాగా ఇప్పటికే పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. అమృత్ పథకం ద్వారా అందిన నిధులతో ఈ మూడు మున్సిపాలిటీల్లో పనులు పూర్తయితే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

తాగునీటి సమస్యకు చెక్..



మున్సిపాలిటీలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. అమృత్ పథకం ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీటి అందించేందుకు అవకాశం ఉంది. త్వరలోనే పనులకు శంకుస్థాపన చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– చింతల వేణు, మున్సిపల్ కమిషనర్, వైరా

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



ఏన్కూరు: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏన్కూరు: అమ్మపాలు అమృతం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని అన్నారు. మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు, గృహసందర్శన, ఆరోగ్యకేంద్రం సందర్శన చేసి తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అమరనేని సుశీల, ముదిగొండ అరుణ, పద్మ పాల్గొన్నారు.

అయ్యగారిపేట సెక్టార్‌లో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట సెక్టార్‌లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, టీచర్లు లక్ష్మీ, భాగ్యలక్ష్మి, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ నగర్‌లో..

తల్లాడ: తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ ఎన్టీఆర్ నగర్‌లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించి.. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శైలజ, పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్: బోనకల్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ సిబ్బంది తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్, ఏఎన్ఎం సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు శిరీష, రమాదేవి, నాగమణి, ఆశ కార్యకర్తలు దుర్గ, లీల తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండలో..



సూచనలు చేస్తున్న వైద్యాధికారి అరుణాదేవి

ముదిగొండ: ముదిగొండ అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యాదికారిణి అరుణాదేవి తల్లిపాలు, ముర్రుపాలు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పీహెచ్‌సీలో తల్లులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, పుష్పలత, పద్మావతి, విజయకుమారి పాల్గొన్నారు.

కోర్టులో న్యాయమూర్తి తనిఖీ



జడ్జి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

మధిర: వార్షిక తనిఖీల్లో భాగంగా మధిర కోర్టును సత్తుపల్లి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ అందరూ అంకితభావంతో పనిచేసి కక్షిదారులకు సత్వర న్యాయం జరిగేలా సహకరించాలని తెలిపారు. న్యాయమూర్తి టి.కార్తీక్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు, న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, సుంకు మోహన్‌దాస్, తూములూరి కృష్ణారావు, నంబూరు జనార్ధన్, దేవరపల్లి సుబ్రహ్మణ్యం, కట్టా పూర్ణచంద్రరావు, కావూరి రమేష్, కోట జ్ఞానేష్, సతీష్, భద్రయ్య పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

కల్లూరు: కొత్త పట్టాదారు రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ ఎం.రూప పేర్కొన్నారు. ఆధార్ కార్డులో 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వరకు వయస్సు ఉన్న రైతులకు మాత్రమే దరఖాస్తుకు వీలుందన్నారు. దరఖాస్తు, రైతు పట్టాదారు పాస్ బుక్ లేదా తహసీల్దార్‌చే డిజిటల్ సంతకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు సమర్పించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

చింతకాని: మండలంలోని మత్కేపల్లికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ బొలకొండ భాను విద్యుదాఘాతానికి గురయ్యాడు. గ్రామంలోని ఓ వ్యక్తికి సంబంధించిన సర్వీస్ వైర్‌ను శుక్రవారం సరిచేసేందుకు ఆయన నిచ్చెన సహాయంతో స్తంభం ఎక్కాడు. ఆ సమయంలో విద్యుదాఘాతానికి గురై కింద పడటంతో తలకు తీవ్ర గాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. కాగా, అనుమతి లేకుండా స్తంభం ఎక్కిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ ఉమామహేశ్వరి తెలిపారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

ముదిగొండ: మండలంలోని వల్లభిలో కోయ రేణుక నివాసంలో బుధవారం రాత్రి చోరీ జరిగిన విషయం విధితమే.. ఈ ఘటనపై రేణుక శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ముదిగొండ ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముందస్తు అరెస్ట్

చింతకాని: మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను చింతకాని పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేశారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ చేసిన వారిలో రామకృష్ణాపురం, లచ్చగూడెం, నర్సింహాపురం గ్రామాల మాజీ సర్పంచ్‌లు కన్నె బోయిన కుటుంబరావు, గురిజాల జాన్సీ, దొడ్డా ప్రవీణ ఉన్నారు.

విద్యా కమిషన్ ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

తల్లాడ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.రంజాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నారుగూడెం, తదితర పాఠశాలలను యూటీఎఫ్ బృందం సందర్శించి పలు సమస్యలను తెలుసుకుంది. ఈ సందర్భంగా రంజాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పూర్వ ప్రాథమిక విద్య నుంచి యూనివర్సిటీ విద్యావరకు నెలకొన్న సమస్యలపై ఒక సమగ్ర విధానం రూపొందించేందుకు మేధావులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ ఎంఎల్సీలు, ఉపాధ్యాయ సంఘాలతోటి ఒక కమిషన్‌ను వేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కె.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్, సీనియర్ ఉపాధ్యాయులు సూదా రామారావు, పి.వెంకటేశ్వర్లు, ఆశాలత, రత్నకుమారి, ఇందుప్రియ, రఫీ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారిలో నందిని, నాయకులు

మధిర: మున్సిపాలిటీ పరిధిలోని 11, 12వ వార్డులకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు మల్లాది వాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారికి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

విద్యార్థులకు బ్లేజర్లు పంపిణీ

వైరా: ఖమ్మం జీవీమాల్, విశిష్ట ఫౌండేషన్ నిర్వాహకుడు గుర్రం శ్రీనివాసరావు, సీత సహకారంతో వైరా గుట్టబడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులకు శుక్రవారం రూ.10 వేలు విలువ చేసే బ్లేజర్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులు ఉపేందర్, గృహలక్ష్మి, పుష్ప, సునీత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

కల్లూరురూరల్: మండలంలోని ముగ్గు వెంకటాపురంలో నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైందని డాక్టర్ నవ్యకాంత్ తెలిపారు. సోమవారం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ రాకుండా ఉండాలంటే.. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, సీహెచ్‌ఓ రేవతి, సూపర్‌వైజర్ రామారావు, ఆరోగ్య కార్యకర్త సుశీల, ఆశ కార్యకర్తలు సునీత, మీన పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు కుర్నవల్లి ఏఈ సుందర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నూతనకల్, కొత్త మిట్టపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ప్రజాప్రతినిధులకు సన్మానం

కల్లూరు: కల్లూరు మండల పరిషత్ పరిధిలో ప్రజాప్రతినిధుల 5 సంవత్సరాల పదవీకాలం పూర్తి అయిన సందర్భంగా స్థానిక ఇమేజ్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరుగనున్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాలెపు రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సుప్రీం తీర్పుపై హర్షం

ఎర్రుపాలెం: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షనీయమని నవతరం సంఘం మండల కమిటీ అధ్యక్షుడు లోకేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని భీమవరం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణ కోసం 30 ఏళ్లపాటు అవిశ్రాంతగా పోరాడి విజయాన్ని అందించిన మందా కృష్ణమాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం మండల కార్యదర్శి రమేష్, కోశాధికారి కాంతారావులు ఉన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ జైపాల్

వైరా: వైరా మున్సిపాలిటీలో నిర్వహించే స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కమిషనర్ సీహెచ్ వేణు సూచించారు. శుక్రవారం వైరాలో చైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5 నుంచి 9 వరకు రోజువారీ షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్‌లు, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్స్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో..



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రమౌళి

తల్లాడ: తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛదనం – పచ్చదనం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మిట్టకొల చంద్రమౌళి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

తల్లాడలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీలో పాల్గొన్న అసిస్టెంట్ పీడీ శ్రీనివాసరావు, తదితరులు

తల్లాడ: తల్లాడ పంచాయతీ కార్యాలయంలో డీఆర్‌డీఏ అసిస్టెంట్ పీడీ సీహెచ్.శ్రీనివాసరావు సమక్షంలో శుక్రవారం ఎన్ఆర్ ఈజీఎస్ పథకం సామాజిక తనిఖీ నిర్వహించారు. గత నెల 22 నుంచి 31వరకు మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు సంబందించి రూ.5.19 కోట్లతో జరిగిన 627 పనులపై సమీక్ష జరిగింది. ఈ సమీక్షలో మస్టర్లకు మొబైల్ అటెండెన్స్‌లో పొరపాట్లు దొర్లాయి. ఈ సందర్భంగా రూ.55 వేలు రికవరీ, రూ.24 వేలు పెనాల్టీ వేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ వెంకటరాజు, అబుడ్స్‌మెన్ రమేష్, విజిలెన్స్ అధికారులు పవన్, శాస్త్రీ, ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎస్ఆర్‌పీ సాంబశివచారి, డీఆర్‌పీల బృందం, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయండి

సత్తుపల్లిటౌన్: రూ.35 కోట్లతో చేపడుతున్న 100 పడకల ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ కోరారు. శుక్రవారం నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. సత్వరమే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. నూతన భవనం చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం ఆస్పత్రి మార్చురీలో ఉన్న రామగోవిందాపురం రోడ్డు ప్రమాద మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఓదార్చారు. ఈయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉడతనేని అప్పారావు, చల్లగుళ్ల నర్సింహారావు, ఎండి కమల్‌పాషా, గాదె చెన్నారావు, పింగళి సామేలు, శివవేణు, నెక్కంటి సాయిబాబు, దొడ్డా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వందపడకల ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న మట్టా దయానంద్

యాభై పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వీరభద్రం

కారేపల్లి: కారేపల్లిలో 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన క్యాదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. శుక్రవారం కారేపల్లిలో మండల అధ్యక్షుడు అజ్మీర శోభన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన గిరిజన సంఘం మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం కారేపల్లిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. పాఠశాలలో సిబ్బంది కొరత ఉందని, మరుగుదొడ్లు తగినన్ని లేకపోవటంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు తక్షణ మే సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు శోభన్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, చిన్నా, వీరభద్రం, గన్యా, చందర్, నాగ పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో గడ్డి మందు పిచికారీ

మధిరరూరల్: మల్లవరం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శుక్రవారం గ్రామ కాంగ్రెస్ నాయకుడు కరివేద రాంబాబు తన సొంత డబ్బులతో గడ్డి మందు పిచికారీ చేయించారు. పాఠశాల ఆవరణలో గడ్డి మొక్కలు పెరగడంతో విష సర్పాలు రావడంతో పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో రాంబాబు ఆ గ్రామంలో ఉన్న రెండు పాఠశాలల్లో గడ్డి మొక్కల నిర్మూలనకు గడ్డి మందు పిచికారీ చేయించారు.

సొంత ఖర్చులతో కాల్వ పూడికతీత

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడులో రైతులు తమ పంట కాల్వకు నీరు వచ్చేందుకు గాను.. తమ సొంత ఖర్చులతో కాల్వలో పూడిక తీత, పిచ్చి మొక్కలు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. జేసీబీ సాయంతో కాల్వ శుభ్రం చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బొడ్డు కృష్ణయ్య, పుచ్చకాయల రామయ్య, సొసైటీ డైరక్టర్ బొల్లెపోగు శ్రీనివాసరావు, పల్లెబోయిన కృష్ణ, కామినేనిరవి, కర్నాటి హనుమంతరావు, పుచ్చకాయల నరేష్, చేబ్రోలు రాంబాబు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

బోనకల్: ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు మండలకేంద్రంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారికి రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అన్నం చందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మధిర డివిజన్ కార్యదర్శి అర్జునరావు, డివిజన్ నాయకులు బాబు, అప్పారావు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రయాణించడం కష్టమే..



మండలకేంద్రంలోని మధిర-విజయవాడ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ నిమిత్తం నిర్మించిన రింగ్ చుట్టూ పలు రకాల బోర్డులను అనధికారికంగా ఏర్పాటు చేశారు. వాణిజ్య ప్రకటనల మాదిరిగా బోర్డులు ఉండటంతో రహదారికి ఎదురుగా వచ్చే వాహనాలేవి కనిపించని పరిస్థితి ఉంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు స్పందించి రింగ్‌లో ఉన్న బోర్డులు తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు. - ఎర్రుపాలెం

ప్రశ్నించాల్సిన అధికారి : రాజేష్, ఏఈ, అర్అండ్‌బీ శాఖ
సెల్ నంబర్ : 99123 40678